కథా కౌముది

# మంత్రం పరమార్ధం

మూలా రవి కుమార్

ఉదయాన్నే వార్తాపత్రిక చూస్తుంటే చరవాణి మోగింది. ఏదో కొత్త నెంబరు. “హలో” అన్నాను.

“హలో, సార్, నేను, చింతలవలస అప్పల నాయుణ్ణి. మన ఊరి నారన్నాయుడు మేష్టారు మీ ఫోన్నెంబరిచ్చేరు.”

చింతలవలస అంటే నాలుగు తరాలుగా మా స్వగ్రామం. విజినారం జిల్లా. ఇప్పుడు నేనుంటున్న వైజాగ్ అనబడే విసాపట్నానికి తొంబై కిలోమీటర్లు. దాదాపు పాతికేళ్ళక్రితం నా పదోక్లాసుపూర్తికాగానే వదిలేసి, మరో పదేళ్ళతర్వాత ఉద్యోగం రాగానే, అమ్మానాన్నలుకూడా నాదగ్గరకొచ్చేసేకా మాస్వగ్రామం అని చెప్పుకోవటానికే అది మిగిలింది. ఇల్లు ఎప్పుడో శిధిలమయ్యింది.

ఊరిపేరు విని మనసు ఉరకలేసింది. కాకపోతే మాఊళ్ళోనాకుతెలిసి పదిహేను మందికి పైగా అప్పలనాయుళ్ళు ఉండే వారు. ఊళ్ళోవాళ్ళుకూడా వాళ్ళని బొజ్జప్పన్న (పెద్ద పొట్ట ఉండే అప్పలనాయుడు), ఎర్రప్పన్న (ఎరుపురంగులో ఉండే అప్పలనాయుడు), చించెట్టప్పన్న (చింతచెట్టు దగ్గర ఉండే అప్పలనాయుడు) మొదలైన వ్యావహారిక పేర్లే గానీ ఒక్కణ్ణి కూడా అప్పలనాయుడు అనిపిలిచే వారు కాదు. ఇప్పుడు నాకు వచ్చిన ఫోనులో భాషా యాసా, ఆపదిహేను మందిలో ఎవరిదీ కాదు.

“ఓకే, చాలా సంతోషం. అప్పలనాయుడు అంటే...” అని ఆగిపోయాను.

నాప్రశ్నబాగానే అర్థం అయినట్టుంది. “నేను సార్. దాసరపేట పోలయ్యకొడుకుని.” ఇంక నాకు ఆధార్ నెంబరు చెప్పినంత స్పష్టత వచ్చేసింది. దాసరపేటపోలయ్య అంటే, మాఊరికి నాలుగుమైళ్ళవతల ఉన్న దాసరపేట ఊరివాడు. మాఊరికి ఇల్లరికం వచ్చినవాడు. అంటే ఇప్పుడు నాకుఫోను చేసిన అప్పలనాయుడు నాపదోక్లాసునాటికి ఏడాదివాడు.

“ఓహో, బంగారయ్య మనవడివా? నువ్వు తొంబై రెండులో పుట్టినట్టున్నావు.” అన్నాను. నిజానికి అతడితాతని ఊళ్ళో వాళ్ళు గుడ్డి బంగారయ్య అనేవారు. చిన్నవయసులో రేచీకటీ, కూతురుకన్నా కొడుకు పదేళ్ళు చిన్నవాడు కావటంతో ఇల్లరికం అల్లుణ్ణి తెచ్చుకున్నాడు.

“సార్. నన్ను ఇంతలా గుర్తుంచుకున్నారా?” సంభ్రమాశ్చర్యాలు నామనసుని తాకాయి.

“సరే బాబూ, ఏమిటీ విషయం?”

“ఏం లేదు సార్. ఒకపనిమీద వైజాగొచ్చాను. మీరు మూణ్ణెల్లక్రితమే వైజాగ్ గవర్నమెంటు కాలేజీలో లెక్చెరరుగా చేరేరని మనూళ్ళో తెలిసింది. ఒకసారి తాతగారికీ, మామ్మగారినీ చూసి రమ్మని మా వాళ్ళు చెప్పేరు. మీకు ఇబ్బందిలేకపోతే ఇప్పుడోసారి వస్తాను.” తాతగారూ మామ్మగారూ అంటే మా అమ్మానాన్నలు.

“అయ్యయ్యో. తప్పకుండా రా.” అని ఇంటికి రావటానికి గుర్తులు చెప్పేను.

ఇంటికొచ్చిన అప్పల నాయుణ్ణి చూసిన నాన్న పురివిప్పన నెమలిలా అయిపోయారు. ఆయనపుట్టినప్పటినుండీ అరవయ్యేళ్ళపాటు ఆ ఊరు కదల్లేదు. పదిహేనేళ్ళగా మా ఉద్యోగాల మూలంగా ఊరువదిలేయటమేకాక, పదేళ్ళు హిందీప్రాంతాల్లో కూడా గడిపారు మరి. స్వంత ఊరి జ్ఞాపకాలు

ఎంత ఆనందాన్నివ్వగలవో అంత ఆనందమూ ఇచ్చాయి. తాతగారికీ మామ్మగారికీ ఒక గంట కబుర్లు చెప్పాడు. నాన్న, తన ముందుతరం వాళ్ళైన బాంద్రుతాత (పేరు తాతినాయుడు, చిన్నప్పుడు బాంద్రుకప్పలా అరచేవాడట), రేషన్నాయుడు (కొన్నాళ్ళు చౌకదరల దుకాణం నడిపేడు), సైకిల్ దాలినాయుడూ (నాచిన్నప్పటివరకూ మాఊళ్ళో ఏకైక సైకిలు యజమాని) మొదలైన వాళ్ళంతా చనిపోయారని తెలుసుకొని ఏడ్చేసారు. వాళ్ళమనవల, మునిమనవల చదువులూ, వృత్తులూ, పెళ్ళిళ్ళూ వివరాలు కనుక్కొని మళ్ళీ మళ్ళీ అడిగి సంతోషించారు. నేను కొంచెం పాల్గొన్నాను. మా ఆవిడ పుట్టిల్లు గోదావరీతీరం కావటాన నూరుశాతం శ్రోతగా ఉండిపోయింది.

అప్పలనాయుడు మా ఊరికి పదిహేను కిలోమీటర్లవతల ఊళ్ళో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. మాఊరి వ్యవసాయ కుటుంబాలనుంచి తొలితరం ప్రభుత్వోద్యోగి. వైజాగెందుకొచ్చేడంటే, వాళ్ళచెల్లికి ఒకసంబంధం కుదిరింది. ఇక్కడెవరో సిద్ధాంతి చేత ముహూర్తం పెట్టించుకొని, ఇంకో పురోహితుణ్ణి పెళ్ళిచేయించుకుందికి మాట్లాడుకొన్నాడుట. ఈ ఇద్దరు పండితుల పేర్లూ మొగపెళ్ళివారు సూచించారుట. ముహూర్తం పెట్టినందుకు ఐదువేలూ, పౌరోహిత్యానికి కారు అద్దె కాక పదివేలూ.

"అన్నిడబ్బులే!" అన్నాను. నా ఊహతెలిసేటప్పటికి మా ఊళ్ళో పెళ్ళిచేయిస్తే పురోహితుడి సంభావన వంద రూపాయలు.

"అదే మూల సార్? ఆంతగొప్పవాళ్ళు ఇద్దరూ దొరికేరు. వాళ్ళరేట్లు తెలిసే వచ్చాం. ఆసలు రేపు మళ్ళీ రావలిసి వస్తుందేమోనని భయపడ్డాము. ఉదయం తొమ్మిదిలోపల రాకపోతే వాళ్ళు దొరకరు. ఏడుగంటలవరకూ రాహుకాలం. ఇంట్లోంచి బయల్దేరకూడదు. ముహూర్తం పెట్టిన సిద్ధాంతిగారిచేత ఫోనుచేయించకపోతే పురోహితుణ్ణి కలవటానికి రేపు మళ్ళీ రావలిసి వచ్చేది."

"ముహూర్తం పెట్టించుకొందికి ఇంటినుంచి బయలుదేరడానికి కూడా మళ్ళీ రాహుకాలమా? అది ఎవరు చెప్పేరు?"

"ఉదయాన్నే ఆరుగంటలకల్లా మాటీచర్స్ వాట్సాప్ గ్రూపులో ఒకాయన తిథి, నక్షత్రం, రాహుకాలం, వర్జ్యం లాంటి వివరాలన్నీ పెడతాడు. మీరవేవీ చూసుకోరా?" ఆశ్చర్యంగా అడిగాడు.

ఆ రైతుబిడ్డ ఆశ్చర్యానిక్కారణమేంటంటే, మేము ఆఊరి పురోహితులం. నాపదోక్లాసు వరకూ మానాన్నగారి కూడా వెళ్ళి పౌరోహిత్య క్రతువులో సాయపడేవాణ్ణి. కానీ, తర్వాత రాహుకాలాలూ, దుర్ముహూర్తాలూ పట్టించుకోవటం మాట అటుంచి, ఆపేర్లు కూడా దాదాపు మరిచిపోయాను.

"నేను ఉత్తరాదిలో ఉన్నప్పుడు అవన్నీ అలవాటు తప్పిపోయాయి. అదిసరే. మానాన్నగారు మన ఊరొదిలేసిన తర్వాత గజపతినగరం నుంచి ఎవరో పురోహితుణ్ణి పెట్టుకున్నారు కదా మీరు. ఆయన ముహూర్తాలు చూడ్డం, పెళ్ళిళ్ళు చేయించటం చెయ్యలేడా?"

"జాతకాలు చూడ్డం అతడికి సరిగ్గా రాదు సార్. ఏదో ముహూర్తం పెట్టేస్తే మంచిదికాదుకద సార్?"

"సరే, జాతకం చూడ్డం, ముహూర్తం పెట్టటం ఇక్కడి సిద్ధాంతికి బాగా వచ్చు. మరి కనీసం పెళ్ళైనా అక్కడి పురోహితుడితో చేయించుకోవచ్చుకదా? కొంచెం డబ్బు ఆదా అయ్యేది."

అప్పలనాయుడు నన్ను చూసిన చూపులో, పురోహితుల కుటుంబంలో చెడపుట్టావుకదా అనే అర్ధం గోచరించింది. ఆలా రెండూ సెకెన్లు చూసాకా, "సార్, లోకల్ పురోహితుడు ఐదువేలే తీసుకుంటాడు. కానీ పెళ్ళిమంత్రాలొకటే చదువుతాడు. ఈయన వేదాశీర్వచనం కూడా చెబతాడు. మాచెల్లికి కాబోయే అత్తవారింట్లో ఇప్పటికే రెండు పెళ్ళిళ్ళు చేయించాట్ట. వాళ్ళు అడిగేరు, మంచిదయింది. లేకపోతే ఈయనగురించీ, పెళ్ళిలో వేదాశిర్వచనం గురించీ మాకు తెలిసేది కాదు. మాచెల్లిపెళ్ళయ్యేకా నాకు పెళ్ళికుదిరితే అప్పుడూ కూడా వీళ్ళ దగ్గరకే వస్తాను సార్." అన్నాడు.

అంతదూరం నుంచొచ్చినవాడి నమ్మకాలజోలికెళ్ళకూడదు కనుక మామూలుగా ఉన్నాను. కానీ, ముహూర్తాలూ శాస్త్రాలపట్ల నా ఉదాసీనతకు నొచ్చుకున్నట్టున్నాడు. టీ అయ్యాకా వెళ్ళిపోయాడు. పురోహితుడి కొడుక్కి, రైతుబిడ్డ ముహూర్తాలూ, వర్జ్యాలూ, వేదమంత్ర ప్రాశస్త్యం చెబుతున్నాడంటే, బ్రహ్మంగారు చెప్పిన కలికాలం వచ్చేసినట్టే అనిపించింది.

అప్పల్నాయుడెళ్ళిపోయాకా మా ఆవిడ రంగంలోకి దిగింది. "వీళ్ళని చూసైనా నేర్చుకొండి. ఇప్పటికే, మనవల్ల బోలెడు తప్పులు జరిగిపోయాయి." అంది. ఆతప్పులేంటంటే, మాపెళ్ళైన వారంరోజులకే గుజరాత్ బదిలీ అవటంతో, మా అమ్మానాన్నలతో కలిసి, కొత్తదంపతలం, సామాన్లు సర్దుకొని జునాగడ్ లో దిగేం. అక్కడ ఇంట్లో దిగిన రోజు అమావస్య. మేం దిగిన రెండ్రోజులకి గాని మా సామానుల లారీ రాలేదు. పాలుపొంగించుకొనే యంత్రాంగం లేకపోవటంతో మా అమ్మ, తను రైల్లో చదువుకొందికి తెచ్చుకొన్న దేవీ భాగవతం పుస్తకాన్ని ఈశాన్యమూల పెట్టి, ఒక

అరటిపండు వలిచి, రెండు అగర్ బత్తీలు వెలిగించి, పుష్పరహిత, దీపరహిత పూజ కానిచ్చేసింది. తీరా బయటకొచ్చి చూస్తే మేము పూజచేసినది ఈశన్యమూల కాదు, నైఋతిమూల. ఆమర్నాటినుంచీ నెల్లాళ్ళు అషాఢమాసం, అత్తగారూ కొత్తకోడలూ లక్షణంగా ఒక ఇంట్లోనే ఉన్నారు. ఇవన్నీ శాస్త్ర సాంప్రదాయ ఉల్లంఘనలే.

అలా మొదలైన మా సంసారంలో, మా అమ్మా, మా ఆవిడా తమ భక్త్యానుసారం, శక్త్యానుసారం ఏవోచేసుకొనేవారు. రాజస్థాన్ లో ఉన్నప్పుడు ఒకశ్రావణ మాసం నోముకి ముత్తైదువలు కావలసి వస్తే, హిందీ గృహిణులకు నోము గురించి బొట్లేరు హిందీ ముక్కల్లో వివరించి కొంతమందిని ఒప్పించి వాయనాలిచ్చేసింది మా ఆవిడ. కొందరు మాత్రం దోషపరిహార దానం అనుకొని, మాదోషాలన్నీ పుచ్చుకున్నవాళ్ళకి అంటుకుంటాయని తీసుకోలేదు. ఒకావిడ వాయనం తీసుకున్నాకా మీరు ఇప్పుడు వచ్చారు. ఒకనిమిషం లేటైతే స్నానానికెళ్ళిపోయేదాన్ని అంది. అంటే వాయనం మైలపడ్డట్టే. అలా అని జరిగిన తప్పుని పుచ్చుకున్నావిడకి చెప్పటం మర్యాదకాదు కదా. వాయనం పుచ్చుకున్నవాళ్ళలో మరికొందరు మాంసాహారులని తర్వాతెప్పుడో తెలిసింది. పాపం, అత్తాకోడళ్ళిద్దరూ అలా రాజీ పడుతూ ఏవోచేసుకొనేవారు. నావీలునిబట్టి వారడిగిన పూజా ద్రవ్యాలు సమకూర్చటం, ఆఫీసు టైముకి ఇబ్బంది రానంతవరకూ పూజలో కూర్చోవటం తప్ప నామిగిలిన జీవతమంతా చార్వాక జీవితమే.

నాలో భక్తిబీజాలు నాటాలనుకున్న మా ఆవిడ సంకల్పానికి ఇప్పుడు అప్పలనాయుడి మద్దతు దొరికింది.

"ఇంతకీ ఈఅప్పలనాయుడు పెళ్ళి ఇంత శాస్త్రోక్తంగా చేయ్యటానికీ మామూలుగా చెయ్యటానికీ తేడా ఏమిటంటావ్?"

"అదేంటీ, మంత్రాలకీ ముహూర్తాలకీ ఏవిలువా లేదంటారా?"

"వీళ్ళనాన్న దాసరపేట పోలయ్య పెళ్ళి ఎలాజరిగిందో విను."

"అది మీకెలా తెలుసు?"

"అప్పుడూ నేను ఐదోక్లాసు. తాత చేయించిన పెళ్ళి అది. అప్పటికే తాతకి ఎనభై ఏళ్ళు నిండటం, ముప్పై ఏళ్ళుగా వాడుతున్న కళ్ళద్దాలు పగిలిపోవటంతో, పంచాంగం చూసేటప్పుడు నన్ను కూర్చోబెట్టేవారు. రైతుకుటుంబాలవాళ్ళు వధూవరులిద్దరి తరపు పెద్దలూ రాగానే, పేర్లని బట్టీ, వాళ్ళజన్మ నక్షత్రం రాసేవారు. జాతకాలు నప్పకపోవటం అంటే ఏంటో తెలీదు. మూఢం లేని సమయంలో ఉండే ఐదారు లగ్నాల్లో, వీళ్ళ నక్షత్రాలిని బట్టి ఒక లగ్నం, దానితో పాటే పెళ్ళిపందిరి రాట ముహూర్తం పెట్టేవారు. రాత్రి పెళ్ళి అనగా ఉదయం మా ఇంటికి బత్తెం పంపేవారు."

"అదేంటి?"

"పెళ్ళిభోజనాలని ఊళ్ళో ఇంటికో మనిషిని రమ్మని పిలిచేవారు. దానిని ఊరామిటి అనేవారు. మరి పురోహితులు ఆ వంట తినరు కనుక ఒక మనిషికి సరిపడా బియ్యం, పప్పూ మొదలైన వండని దినుసులు, రెండు అరిసెలు ఒక జంగిట్లో పెట్టి మా ఇంటికి తెచ్చేవారు. సాయంత్రం బాజాలతో మా ఇంటికి వచ్చి తాత రాసిన లగ్నపత్రిక తీసుకెళ్ళేవారు. లగ్నపత్రిక అంటే, తాటాకుపై రాసిన శుభలేఖ అన్నమాట. దానిని వరుడి తలపాగాలో ఉంచేవారు. రాత్రి తాత పెళ్ళిచేయిస్తున్నంతసేపూ నేను కూడా ప్రక్కనే ఉండీ తాతకి ఆతంతులో సాయపడేవాణ్ణి. అలా ఈదాసరపేటపోలయ్య పెళ్ళిలో జరిగిన విశేషం గుర్తుండిపోయింది."

"ఏమిటావిశేషం?"

"ముహూర్తం రాత్రి ఒంటిగంట తరువాత కనుక గంటముందు పెళ్ళివారితరుపు మనిషి వచ్చి నిద్ర లేపాలి. వాళ్ళు రావటం అరగంట లేటయ్యింది. వెంటనే తాత వాళ్ళని తిరిగిపంపేసి, నాచేతే వాచీని అరగంట ముందుకి నప్పించేకా ఇద్దరం పెళ్ళిపందిట్లోకెళ్ళేం. పెళ్ళి లక్షణంగా జరిగింది. ఇప్పుడొచ్చిన అప్పలనాయుడూ, తర్వాత ఆడపిల్లా లక్షణంగా పుట్టేరు. పిల్లాడు చక్కగా చదువుకొని ప్రభుత్వోద్యోగి అయ్యాడు. ముహూర్తం తప్పి జరిగిన పెళ్ళి కూడా విజయవంతంగా జరిగింది."

"అది తాతగారు చేయించిన మంత్రబలమేమో?"

"ఆవిషయానికి తర్వాత వద్దాం. ముందుగా ముహూర్తం నిమిషాలు, సెకెనులు ఖచ్చితంగా చూడకపోయినా పెనుప్రమాదాలేవీ జరగవని ఒప్పుకున్నాట్టేనా?"

ఔనూ, కాదూ అనకుండా అచ్చతెలుగులో చెప్పాలంటే డిప్లమేటిక్ గా తల ఊపింది.

"సరే, ఇప్పుడు దాసరపేట పోలయ్య మామగారైన గుడ్డిబంగారయ్య పెళ్ళి విశేషాలు చెప్పనీ."

"అదిమీరు పుట్టకముందు జరిగి ఉండాలి కదా?"

"నిజమే, కాపోతే అందులో జరిగిన విశేషం వల్ల మాపెద్దలు చెప్పగా విని గుర్తుంచుకున్నాను."

"చెప్పండి."

"ఆపెళ్ళి పంతొమ్మిదివందల డెబ్బై ప్రాంతంలో జరిగింది. మా తాతగారి మేనల్లుడు రామం మావయ్య తెలుసు కదా?"

"తెలుగుమాస్టరుగా జాయినయి హెడ్మేష్టారుగా రిటైరయారు కదా? వాళ్ళబ్బాయే కదా ఇప్పుడు ముంబైలో ఉద్యోగం చేస్తున్నది?"

"ఔను. ఆయన అప్పుడే భాషాప్రవీణ పూర్తిచేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ వేసవికదా అని మా ఊరురొచ్చేరుట. సరిగ్గా అప్పుడే మా ఊళ్ళో ఒకే ముహూర్తానికి నాలుగు పెళ్ళిళ్ళు వచ్చాయి. రెండు పెళ్ళిళ్ళ పెద్దలు ఒకే పందిట్లో చేయటానికొప్పుకున్నారు. మిగిలిన వాళ్ళిద్దరూ వాళ్ళ ఇంటిముందు పందిట్లోనే చేస్తామని పట్టుపట్టటంతో ఒకపెళ్ళికి నాన్నవెళ్ళినా నాలుగోపెళ్ళికి పురోహితుడు తక్కువపడ్డాడు. అప్పుడే రామ్మామయ్యని పంపేసారు. నిజానికి తనకి పెళ్ళిమంత్రాలు రావు."

"మరెలా చేయించారు?"

"ఉదయం తాత, మాంగళ్యధారణ, జీలకర్రాబెల్లం మంత్రాలు నేర్పేరు. సంధ్యావందనం మామయ్యకి వచ్చు ఆ మంత్రాలతో మిగతా పెళ్ళితంతు కానిచ్చెయ్యమని, పెళ్ళితంతులో ఘట్టాల క్రమం ఒక పేపరుమీద రాసిచ్చారు. నామంత్రాల్లో తప్పులు పట్టుకొనేదెవరు మామయ్యా అని తాతకి ధైర్యం చెప్పి బయల్దేరుట మామయ్య."

"ఇంతకీ అక్కడేం జరిగింది?"

"మామయ్య సంధ్యావందనం మంత్రాలు పావుగంటలో ఐపోయాయిట. మళ్ళీ అందుకోబోతే చదివినవే మళ్ళీ మళ్ళీ చదువుతున్నట్టూ ఎవరో వెనకాలనుంచి గొణిగేరుట. అందుకని మామయ్యయ్య సుమతీ శతక పద్యాలు మకుటం తీసేసి చదవటం మొదలెట్టేరుట. ఆరోజుల్లో పెళ్ళిపందిట్లో ఎవరూ చదువుకున్నవాళ్ళు లేరని మామయ్య ధైర్యం. పొరుగూరి చుట్టాల్లో ఎవరో ఐదోక్లాసువరకూ చదువుకున్నవాడున్నట్టున్నాడు. పజ్జాలు చదివి పెల్లి చేసేత్తన్రు అని గొణగటం మామయ్యకి వినపడింది. గట్టిగా అంటే పురోహితుడికి కోపం వచ్చి వెళ్ళిపోతాడని వాళ్ళ భయం. ఆతర్వాత గజేంద్రమోక్షం పద్యాలు అందుకున్నాడు. ఆపందిట్లో ఉన్నవాళ్ళకి అవి గజేంద్రమోక్షం పద్యాలని తెలీకపోయినా, అందులో తెలుగుపదాలు పట్టేసారు. అప్పుడు మామయ్య సమయస్ఫూర్తితో మంత్రాలు మొదలెట్టి ఒక్కరిమార్కూ లేకుండా, పందిట్లో ఉన్నవాళ్ళంతా, పౌరోహిత్యం వృత్తిలో లేకపోయినా ఎంతబాగా మంత్రాలు చదివేరో, ఇలాంటి పంతులుగోరి మంత్రాల్లో తప్పులు వెతికేరు ఈ కుర్ర యెదవలు అని పెళ్ళిపెద్దలచేత పొగిడించుకొని మరీ పెళ్ళిపూర్తిచేసారుట."

"అన్నిమంత్రాలు రావుకదా, ఆయనకి?"

"విషయమేమిటంటే, మామయ్య విజయనగరంలో చదువుమొదలయ్యేసరికే ఒడుగు అవటంతో, చిల్లరఖర్చులకు దక్షిణ డబ్బులొస్తాయని ఆదివారాలు తద్దినం భోజనాలకెళ్ళేవారుట. ఆబ్దికంలో భోక్తలని పీటమీదకూర్చోబెట్టటానికీ, భోజనం మొదలెట్టటానికీ మద్య కనీసం ఒక గంట పూజ ఉంటుంది. ఆమంత్రాలు మళ్ళీ మళ్ళీ వినటం వల్ల మామయ్యకి కంఠతా వచ్చేసాయి."

"అంటే?" మా ఆవిడకి విషయం అర్థం కాలేదు.

"ఆపెళ్ళికి మామయ్య తద్దినం మంత్రాలు చదివేసారు. ఆదంపతులు వాళ్ళకాపరానికి యాభై ఏళ్ళు పూర్తిచేసుకున్నారు. ముహూర్తఘడియలు మించిపోయేకా జరిగింది అప్పలనాయుడి తండ్రి పెళ్ళి. అద్భుతమైన ముహూర్తంలో, వేదాశీర్వచనాలతో జరిగిన ఏపెళ్ళికీ తీసిపోనంతగా విజయవంతమయాయి కదా రెండు పెళ్ళిళ్ళూ. దీనర్థం ఏమిటంటే మనసుమనసు కలవటమే మంత్రం పరమార్థం."

"మనసుమనసు కలవటమే మంత్రం పరమార్థం అని మంత్రాల్లో కూడా ఉందా? నేనింకా అది పెళ్ళిపుస్తకం సినిమా పాటలోనే ఉందనుకుంటున్నాను." అని గోదావరీ వెటకారం గుప్పించి వెళ్ళిపోయింది, మా ఆవిడ.

★★★

**Click here to share your comments on this story**